గిస్తూ పాకీస్థాను ఇండియాతో దౌర్జన్యానికి దిగితే అమెరికా పాకీస్థానుకు తగు సలహా యివ్వగలదన్న ఆశాభావం ప్రకటించడం మినహా మరేమీ చెప్పక పోవడాన్నిబట్టి, మేలుకంటే కీడునే ఎక్కువ శంకించవలసివుంది. పాకిస్తాను గవర్నరు జనరల్ యిటీవల అమెరికా వెళ్ళి అమెరికన్ ప్రెసిడెంటు, రక్షణమంత్రులతో జరిపిన సంప్రతింపులనుబట్టి, అడ్మిరల్ రైటు పాకిస్తాన్ వచ్చి కైబరు కనుమను సందర్శించడంబట్టి, అమెరికా ఎంతగా కాదన్నా, పాకిస్తానులోని గిల్జిత్ మున్నగు సైనిక స్థావరాలకోసం అమెరికా యీ సంధి తలపెట్టినదని ఊహించవలసి వుంది. ఈ ఊహే యదార్థమైతే అమెరికా తీసుకుంటున్న యీ చర్య రష్యాతో కాలుదువ్వినట్లే, రష్యాకూడ ఆసియాలో సైనికంగా తన పలుకుబడిని ఇతోధికం చేసుకునేందుకు ప్రయత్నించవచ్చు. ముందుముందు ఈ రెండు అగ్రరాజ్యాల సంఘర్షణలు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీయడమే కాకుండా ఆ యుద్ధానికి పాకీస్థాను, ఇండియాలు ప్రధాన రంగస్థలం కాగల ప్రమాదమున్నది.

అంతర్జాతీయంగా యింత ప్రాముఖ్యత వున్నందునే, యీ ఒడంబడికను ఆసియారాజ్యాలన్నీ ఐక్యకంఠంతో నిరసిస్తున్నవి. లోగడ రెండుయుద్ధాల ఫలితాలు చవిచూచిన శాంతికాముకులైన ఆసియాప్రజలు, తమ దేశం యుద్ధరంగంగా మారుతుంటే చేతులుకట్టుకు చూస్తూ వూరుకోవడం కల్ల. ఈ సమస్యకున్న అంతర్జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యానైనా యీ ఒడంబడిక అంతర్జాతీయ సమితిలో ప్రస్తుతం ప్రస్తావనకు వచ్చినా, రాకున్నా, రానున్న పరిణామాలే యీ విషయంలో అమెరికాయొక్క బాధ్యతను ప్రపంచానికి వెల్లడిచేయగలవు.

---

స్కెచ్

# విచిత్రం

దివ్యప్రభాకర్

అవమానాలు రకరకాలుగా, వివిధ మార్గాల మానవుణ్ణి ఆవరిస్తాయి. వాటిని ఎదుర్కోవలసివచ్చేట్టు ప్రవర్తించనే ప్రవర్తించరు కొందరు. కొందరు అవమానాలను భరించటం వాటిని జీర్ణించుకోడం అలవాటుపడివుంటారు. ఈ రెండు శాఖలవారు నిరపాయులు. కాని కొందరికి అవమానాలు అనుకోకుండా తటస్థపడి ఆందోళితుల్ని చేస్తాయి. వాళ్ళకి గత్యంతరం తోచదు. అకస్మాత్తుగా దగ్గర్లో పిడుగుపడ్డంత ఖంగారు పడతారు.

ప్రస్తుతం రాధాకృష్ణ పరిస్థితి అలాగే వుంది. ఓ పట్టాన యీ అవమాన పిశాచం బారినుంచి తప్పించుకోడం దుస్సాధ్యంగా తోచసాగింది. మనస్సుని కుదుటపరచుకొని సుదీర్ఘ యోచనాపరుడయ్యాడు. మిత్రుల అనుభవాలూ, సాహిత్యం అతని మెదల్లో మెలిసాయి. కర్తవ్యం మాత్రం సుసాధ్యం కాలేదు. ఇంత కాఫీతాగి, సిగరెట్టు పీలుస్తూ ఇంటికి వెళ్ళకుండా హోటల్లోనే ఓ మూల వుండిపోయాడు.

పోనీ వెంటనే ట్రైన్‌కి స్వగ్రామం పోదామనుకున్నాడు. కాని అదీ అవమానంలో ఓ భాగం అవుతోంది. ఇలాంటి సమయంలోనే గనక నర్స్ వుంటే ఎంతమంచి ఉపాయం చెప్పి తన ప్రాబ్లెం ఇట్టే సాల్వ్‌చేసి వుండును! అని మిత్రుణ్ణి తలుచుకున్నాడు. ఊరుగానివూరు ఆత్రారిఊరు... ముఖపరిచయస్థుడు ఒక్కడూ లేడు. వెధవ ఆలోచనలెన్నో వొస్తున్నాయిగాని ఉపయోగ యోగ్యమైంది ఒక్కటీ లేదు. అవమానం పరులవల్ల జరగటం అలా అట్టేపెట్టి, తన మెదడు యింత వీక్‌నెస్‌కి లోనయినందుకు మందు ఆత్మావమానానికి గురి అయినట్టు ఫీలయ్యాడు.

పేపరు చింపేద్దామన్నంతకోపం లోపల్నుంచి త్రోసుకొస్తోంది. రిజల్ట్సు ఇప్పుడే తగులాడాలీ? తన ఖర్మం కాలి అవ్వి తగులడే రోజుకి తను

అత్తారింటిదగ్గర తగులడాలి? అప్వ! మురిపాల నూతన సతిముందు తనకెంత అవమానం! ఇదే తన ఊరయితేనా, ఆపళంగా వెంకటేశ్వరరావు ప్రెస్సుకి వెళ్ళి ప్రక్కనెంబరుమీద తన నెంబరు గుర్తేసివుండేవాడు. అసలు తను ఇంటిదగ్గరే ఉండటం తటస్థిస్తే నాన్నచేత నాలుగు చీవాట్లూ తిని, అన్నం తినకుండా అమ్మని ఏడిపించి, బ్రతిమాలించుకుని అక్టోబరుకి హాయిగా చదువుకుంటూండేవాడు.

తాపీగా కూర్చున్నవాడల్లా అమాంతం సిగ్నల్ లేచినట్లు లేచి మాతులిగృహాభిముఖుడయ్యాడు. నడక సాగించగానే ఉపాయాలుకూడా అనంతంగా మెదడులో ముసిరాయి. దాంతో పాటే నడకకూడా జోరయింది. ఇల్లు సమీపిస్తున్న కొద్దీ రాధాకృష్ణ చలిజ్వరంవాడు ఒణికినట్టు ఒణకసాగాడు. వెంటనే ఓ శక్తి కిరణం, ఓ ధైర్య జ్యోతి నిరాశా తిమిరాన్ని పారద్రోలాయి. 'ఛీ! ఇంత పిరికివాడా తను!' అని ఆశ్చర్యపడ్డాడు.

గుమ్మం మెట్లు ఎక్కుతూంటేనే మామగారు ఎదురయ్యారు "ఏమోయ్! ఎక్కడికెళ్ళావ్, చాలా పొద్దెక్కిందే!" అన్నారు.

రాధాకృష్ణ సిగ్గుపడ్డాడు. పాపం! ఆ ముసలాయన తనకోసం యింతవరకూ భోంచెయ్యకుండా వేచివున్నారు. ఆయనతోపాటే ఇంటిల్లిపాదీని. "మావూరినుంచి ఫ్రండ్సు వస్తేనూ, వాళ్ళతో మాట్లాడుతూ కూర్చున్నా, మీరు తినక పోయారూ?" అన్నాడు విధాయకంగా.

"ఆఁ!... ఇంతలో ఏం తొందరొచ్చిందిలే!.. పద... స్నానంచెయ్యి" అని ఆయనకూడా లోపలికొచ్చారు.

భోజనాలదగ్గర బావమరిది అన్నాడు "బావా అక్టోబరుకి ఈ సెంటరుకికట్టు. కాస్త నాకు చెపుతూనూ ఉండొచ్చు" అని.

రాధాకృష్ణ ఒక్కనిమిషం ఉక్కిరిబిక్కిరయ్యాడు ఇతనికెలా తెలుసు తన నెంబరు? తనే ఎప్పుడో చెప్పివుంటాడు. రెండుసార్లు ఫిప్తు ఫారం తప్పిన బావమరిది పాటి జ్ఞాపకశక్తి తనకి లేకపోయె! ఎందుకూ తన ఇంటర్మిడియట్...? "ఏమిటీ?... అక్టోబరుకి కట్టటమేమిటి?" అన్నాడు తను ఆశ్చర్యపోతున్నట్టు నటిస్తూ.

బావమరిదీ, అత్తగారూ, మామగారు—తన ఐడియాప్రకారం గోడప్రక్కనేఉండే తనభార్యా ఒక్కసారిగా తలలెత్తి ఆశ్చర్యంగా చూశారు తనవంక. "ఏమిటీ? నీ పరీక్ష పోలేదూ?" అన్నారు మామగారు అందరికంటే త్వరగా ఆశ్చర్యాన్ని అధిగమించి.

"పరీక్షపోవడమేమిటి? నేను ప్యాసయ్యాను. మీకెవరు చెప్పారు అలా?" అన్నాడు రాధాకృష్ణ వాళ్ళతో ప్రమేయంలేనట్టు భోజనం సాగిస్తూనే.

బావమరిది అందుకున్నాడు "నీ నంబరు రెండువేల నాలుగువందల అయిదుకాదూ?"

"ఊహు... నా నెంబరు టూ, ఫోర్, నాట్ ఫోర్" అన్నాడు. బావమరిది గ్రుడ్లుమిటకరించి చూస్తూ "నువ్వు నాతోచెప్పింది..." అని ఏదో అనబోతూండగానే తండ్రి అందుకుని "చాల్లే సంతోషించాం తెలివితేటలు ... దద్దమ్మ... అంతజ్ఞాపకశక్తి లేనివాడివి ఓచోట గుర్తురాసుకోవాలి... శుంఠ" అని కూగలేసి అతని నోరు మూయించారు. "మేమిందాకట్నుంచీ నీ పరీక్ష పోయిందనే అనుకుంటూన్నాం" అన్నారు అల్లుడితో.

రాధాకృష్ణ ఓ చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు. తన పాచిక పారినందుకు తనే ఆనందిస్తూ ఇప్పటికీగండంగడిచి గట్టెక్కినట్టేనని నిట్టూర్చాడు.

ఆవాళ మధ్యాహ్నం అల్లుడు పరీక్షలో విజయంసాధించినందుకు ఆవ్వీ, ఇవ్వీ దిట్టంగా కడుపుబ్బా తగిలాయి.

* * *

తల్లిదండ్రులదగ్గర యదార్థాన్ని దాచే ధైర్యం అలవాటూ లేవు రాధాకృష్ణకి. తండ్రి చివాట్లూ, తల్లిలాలింపులూ పూర్తయ్యాయి. "తరవాత దానికన్నా సరిగ్గా చదివేసూ" అని మెత్తని మొట్టికాయ మొట్టాడు తండ్రి. చదివినదే మళ్ళీ చదవటం ఎవరికైనా విసుకే, ఏదో మొక్కుకోసం పుస్తకాలు ముందేసుకుని గదిలోకూర్చుంటున్నాడు రాధాకృష్ణ.

పనుండి ఎక్కడికో బయల్దేరాడు తండ్రి. పోస్టుమాన్ ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. ఆయనకు

పిల్లమీదపడి చత్వారం ప్రాప్తించింది. "ఒరే రాధాయ్! ఈ ఉత్తరమేమిటో చూడ్రా!" అని కేకేశాడు. ఉత్తరంమాటవిని తల్లి యింట్లోంచి వచ్చింది. తన కూతురుదగ్గర్నుంచి నెలతప్పిందని ఎప్పుడు కబురు వస్తుందా అని యెదురుచూస్తున్న ఆమెకి ఆతుర్దాగావుంది. అందుకని వస్తూవస్తూ గూట్లోఉన్న భర్తగారి సులోచనాలుకూడా తెచ్చి అందించింది. రాధాకృష్ణ వొచ్చేలోపలే ఆయన చదవటం ప్రారంభించాడు. ముక్క ముక్కకీ ముగ్గురూ ఆశ్చర్యంలో మునిగిపోతున్నారు. ఉత్తరం పూర్తిచేసి తండ్రి కొడుకు వంక తిరుగుతో "ఇదేవిట్రా?" అన్నాడుఅర్థం కానట్టుగా.

రాధాకృష్ణ వెంటనే సమాధానం చెప్పే స్థితిలోకి రాలేకపోయాడు. తల్లి సంగతి సందర్భాలు వెంటనే అర్థంచేసుకుని నవ్వుతూ భర్తగారి వంక చూస్తూ "పెళ్ళాందగ్గర చిన్నతనమేస్తుందనండీ, పరీక్ష అయ్యాకని చెప్పాడుగా వున్న వాళ్ళతో... నా తండ్రే, నీకెంత అవమానమనిపించిందిరా, పిచ్చి సన్నాసీ" అంది. మెల్లిగా కొడుక్కి దగ్గరగా వెళ్ళింది. రాధాకృష్ణ తల్లి పరిజ్ఞానానికి అవ్యక్తానందాన్ననుభవించి తెప్పరిల్లాడు. తండ్రికి కోపం ముంచుకొచ్చేదేగానీ, ఆయనకి తన చిన్ననాటి తాలూకు ఏ సంఘటన వల్లనో శాంతించి, అలుసుగా వుంటుందని బుజ్జి మీసాల చాటునే నవ్వుని దాచుకుంటున్నాడు.

"మీరు వెంటనే వెళ్ళి సంగతంతా వియ్యంకుడికి బోధపరచి ఆ ఉద్యోగాన్ని ఈ మూణ్ణెల్ల పాటూ కాస్త ఆపమని చెప్పండి. ఆ ఏడుకొండల వాడి దయ చల్లగావుండి అప్పుడు ఉద్యోగంలో ప్రవేశిస్తాడని చెప్పిరండి...పాపం! ఆయనెంత ఆప్యాయంగా అల్లుడికోసం ఉద్యోగం వెతికాడో!" అంది తల్లి.

"ఆఁ! పాపం! నీ కొడుకులాంటి వాళ్ళు దేశంలో ఎవళ్ళూ లేరని ఉద్యోగం మూణ్ణెల్లు ఆపివుంచుతారు! ఆయనకెంత ఆశాభంగం కలిగించినవాళ్ళ మౌతామో తెలుసా! హుఁ!" అన్నాడు తండ్రి వియ్యంకుడిమీద సానుభూతిగా.

రాధాకృష్ణ మెదలకుండా గోడకానుకుని, తలవొంచుకుని నిల్చున్నాడు. నిజంగానే తను మామగారికి ఆశాభంగం కలిగిస్తున్నాడు. తనే ప్యాసయివుంటేనా రేపేపాటికి ఉద్యోగస్థుడయివుండేవాడు. అక్టోబరు తరవాత ఇటువంటి ఛాన్సు వెంటనే దొరుకుతుందనే నమ్మకమేముంది?...ఎవడో అదృష్టవంతుడు జాయినౌతాడా వుద్యోగంలో. రాధాకృష్ణకి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

"టెలిగ్రాం!" వాకిట్లో కేక. రాధాకృష్ణ గబగబా వెళ్ళాడు తప్పినవాడయినా ఫరవాలేదు పనికివస్తాడని మామగారు టెలిగ్రాం ఇచ్చివుంటాడని అతనికి ఆశగా తోచింది.

టెలిగ్రాం అంటె తల్లికి భయం దుర్వార్తల్ని మోసుకొచ్చేందుకే దాన్ని ఉపయోగిస్తారని ఆవిడ నమ్మకం. కాళ్లు ఒణుకుతూ, తడబడుతూ "ఏవిట్రా?" అంది. తండ్రికూడా సంగతికోసం త్రొక్కుళ్ళాడుతున్నాడు.

"అమ్మోయ్!"అని అరిచాడు బిగ్గరగా రాధాకృష్ణ. తల్లి ఆపళంగా కుప్పగా కూలిపోయింది. తండ్రినోరు ఆవలించాడు.

"నేను పరీక్ష ప్యాసయ్యానే! ఆంధ్రా యూనివర్సిటీనుంచే వొచ్చింది ఇది. పొరపాటు వేశారుటే! నేను ప్యాసయ్యాను" అని ఆనందోద్రేకం పట్టలేక తొట్రుబడుతూ చెప్పాడు రాధాకృష్ణ.

మర్నాడే రాధాకృష్ణ ఉద్యోగస్థుడయ్యాడు.

